# విద్యార్థులే దేశమునకు సిరి సంపదలు

సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమ శిక్ష కర్తవ్యపాలనంబు
నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు
సత్యమును తెల్పుబాట శ్రీసాయి మాట

అర్థబలము అంగబలము
భక్తిముక్తుల నేర్చేకు పనికిరావు
విద్యాబలముకూడ కానరాదు
దైవబలమొక్కటె నరుని దరికి చేర్చు

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

ఈ ప్రపంచములో అత్యంత అద్భుతమైన యంత్రము, మానవ శరీరము. విభిన్న ప్రకృతులతో, అంగములతో, భాగములతో కూడినదే యీ శరీరము. అన్నియు ఒక దానితో ఒకటి సహకరించి పనిచేయుచుండును. వీటిలో ఏ అంగముగాని, ఏ భాగముగాని విరుద్ధమైన మార్గమున ప్రవర్తించిన మానవుని ఆరోగ్యమే క్షీణించిపోవును. అటులనే సమాజమునందుగానీ, ఒక జాతియందుగానీ, ఒక దేశమునందుగానీ విభిన్న వ్యక్తులు వుండటం సహజము. కాని, వీరందరి ఐక్యతచే, సహకారముచే తమ అనుభవాన్ని ఆనందముగా లోకానికి అందించినప్పుడు శాంతి, భద్రతలు జగత్తునందు అభివృద్ధి అవుతాయి. మానవునియందు ఐకమత్యము క్షీణించి విరుద్ధమైన భావములతో సహకారమును విస్మరించి ప్రవర్తించినప్పుడు, తన కర్తవ్యమునే తాను నిర్వర్తించలేకపోయినప్పుడు, జగత్తు అనేక కష్టములకు, నష్టములకు గురి కావలసివస్తుంది.

sri sathyasaivachanamrutam

**సరస్వతీ నిలయములు కావలసిన విద్యాసంస్థలు లక్ష్మీ నిలయములుగా మారిపోవటంచేతనే ఈనాడు విద్యావిధానము అస్తవ్యస్తమై పోయింది**

ఆలోచించగల ప్రతిమానవుని అయోమయ స్థితిలో ముంచెత్తే సమస్యలు యీనాడు విద్యారంగములో విరివిగా వున్నవన్న విషయము విజ్ఞులకు విదితమే! నిత్యజీవితములో మానవుడు అనుసరించే ప్రతిరంగమును పుష్టివంతముగాను, ఉపయోగవంతముగాను తీర్చిదిద్దవలసిన బాధ్యత విద్యార్థులయందున్నది. యిట్టి బాధ్యతను దేశపౌరులందరికి అందించి, వారిద్వారా మానవతావిలువలు ప్రకటింపచేయటానికి తగిన కృషి యీనాడు సన్నగిల్లి పోయినది. సరస్వతీ సదనమునందు లక్ష్మీదేవి ప్రవేశించటంవలన యీ విద్యాసంస్థలయొక్క పరిస్థితులు వికృతి మార్గములను అనుసరించి నడుస్తున్నాయి. పవిత్రమైన, నిర్మలమైన, నిస్వార్థమైన, నిశ్చలమైన బాలబాలికల హృదయములు యీనాడు మాలిన్యముతో కుమిలి, కృశించి, కూలిపోవుచున్నవి. పవిత్రమైన భావములు, ఉపయోగకరమైన తలంపులు, యీ విద్యార్థుల హృదయమునందు యేమాత్రము ప్రవేశించుటలేదు.

దీనికి మూలకారణము, బోధనావిషయమునందు సరైన మార్గమును అనుసరించకపోవటమే! యీనాడు విద్యావిధానము చైతన్యముకాని, నైపుణ్యముగానీ లేక యాంత్రికముగా బోధలు జరుగుచున్నవి. విద్యయొక్క విశిష్టతను అధ్యాపకుడుగానీ, విద్యార్థులుగానీ గుర్తించలేకపోతున్నారు. విద్య కేవలము ఉద్యోగ నిమిత్తమనే భావము వీరి మనసులయందు ఆవరించి విద్యార్థులను అనేక విధములైన పెడమార్గమును పట్టించి మానవత్వమునే నిర్మూలము గావించుచున్నది. మానవాభ్యుదయమునకు మార్గదర్శకమైన విద్యావిధానమును యీనాడు కేవలము ఒక జీవిత పోషణ నిమిత్తమై, స్వార్థనిమిత్తమై, స్వప్రయోజన నిమిత్తమై వినియోగించుకొనుటకు కృషి సల్పటంచేతనే యీ విధమైన అశాంతి చెలరేగింది. కనుక, యీనాడు మనకు అవసరమైనది, ఉత్తమమైన అధ్యాపకులు. ఉత్తమ అధ్యాపకులను అభివృద్ధిపరచినప్పుడే దేశముయొక్క, విద్యార్థులయొక్క భవిష్యత్తు ఎంత వున్నతమైన స్థితినైనా అందుకొనగలదు.

sri sathyasai vachanamrutam

ప్రపంచమంతయు విద్యార్థులయొక్క అదృష్టముపైనే ఆధారపడి వున్నది. విద్యార్థులే దేశమునకు సిరిసంపదలు. అన్నిరంగములందుకూడను విద్యారంగము చాలా ప్రధానమైనది. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక, వైజ్ఞానిక మార్గములందుకూడను యీ విద్యార్థులయొక్క తత్వమును సరైన మార్గమున నడపించుటకు తగిన అధ్యాపకులు యీనాడు అత్యవసరము. అపరిగ్రహము, బ్రహ్మచర్యము, ఆస్తేయము, అహింస, సత్యము యీ ఐదు గుణములు విద్యార్థులయందు విరివిగా అభివృద్ధి గావించవలెను. మానవునియందు యీ ఐదే పంచ ప్రాణ సమానంగా వారిని పోషిస్తూ వుంటాయి. విద్యార్థులుగానీ, అధ్యాపకులుగానీ అపరిగ్రహమనే దానిని ప్రప్రథమముగా అనుసరించాలి.

**అధ్యాపకులు, విద్యార్థులు ఇరువురియందు ప్రేమ, సేవాసక్తి విరివిగా పెరిగినప్పుడే దేశము అన్ని విధాల సుభిక్షముగా ఉంటుంది**

ఒకరికొకరు యిచ్చుకొని, పుచ్చుకొనవలసినది ప్రేమతత్త్వమే! అఖండమైన ప్రేమ, సేవాసక్తి విద్యార్థులయందు, అధ్యాపకులందు విరివిగా పెరిగినప్పుడే దేశము అన్ని విధములుగా సుభిక్షాన్ని అందుకుంటుంది. విద్యను బోధించటము జీవనాభివృద్ధి నిమిత్తమై కాకుండా జీవితముయొక్క పవిత్రతను గుర్తించే నిమిత్తమనే సత్యాన్ని అధ్యాపకులు గుర్తించాలి. కానీ యీనాటి అధ్యాపకులుగానీ, విద్యార్థులుగానీ విద్య జీవిత పరమావధి నిమిత్తమనే భావమును విస్మరించి, జీవనోపాధి అనే లక్ష్యాన్ని వుంచుకోటంచేతనే సక్రమమైన మార్గమును అనుసరించలేకపోతున్నారు. మానవునియందు గుప్తముగావున్న దైవశక్తిని వ్యక్తీకరింపజేసే శక్తి ఒక్క విద్యమాత్రమే! యీనాటి విద్యాసంస్థలన్నీకూడను కేవలము విద్యార్థులను పట్టభద్రులను గావించే కర్మాగారములుగా తయారౌతున్నవి. విద్యార్థులకు, అధ్యాపకులకు వుండవలసిన సన్నిహిత సంబంధ బాంధవ్యమును యిరువురుకూడ గుర్తించుకోలేకపోతున్నారు. గురువులపైన వుండవలసిన వినయ, భయవిశ్వాసములు విద్యార్థులయందేమాత్రము కానరావటంలేదు. అదే విధంగా విద్యార్థులపైన వుండవలసిన వాత్సల్యభావము, ప్రేమతత్త్వము అధ్యాపకులయందు కానరాకున్నవి. ఈ అధ్యాపకులయొక్క ప్రబోధలుకూడను కేవలము యాంత్రికముగా

జరిగిపోవటముచేతనే విద్యార్థులయొక్క మనస్థితి అస్తవ్యస్తముగా మారిపోతున్నాది. విద్యార్థియొక్క భవిష్యత్తుకు తగిన ఆదర్శప్రాయముగా యీ అధ్యాపకులు కృషి సల్పటములేదు. అధ్యాపకులపై విద్యార్థులుకూడను తగిన విశ్వాసమును అభివృద్ధి పరచుకోటంలేదు.

**ఈనాటి విద్యావిధానము ఇంతటి దుస్థితిలో ఉండడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇరువురూ బాధ్యులే!**

ఇది ఒక పాత్ర. ఈ పాత్రయందుండిన పదార్థమును వేరొక పాత్రలో వేయాలనుకున్నప్పుడు రెండుపాత్రలుకూడను సరైన స్థితిలో వుండినప్పుడే ఒక పాత్రలోని పదార్థము రెండవపాత్రలో చేరటానికి వీలవుతుంది. పై పాత్ర యేమాత్రమైనా చెదిరినప్పుడు యిందులోని పదార్థము క్రింది పాత్రలోనికి చేరటానికి వీలుండదు. అదే విధంగా పై పాత్ర స్థిరముగావుండి క్రిందపాత్ర యేమైనా కదలెనా పై పాత్రలో వున్న పదార్థము క్రింది పాత్రలో చేరటానికి వీలుండదు. ఉన్నతస్థాయియందువున్న పాత్రయే అధ్యాపకుడు. క్రిందస్థాయి యందుండిన పాత్రయే విద్యార్థి. ఇందులో యిరువురి భావములుకూడను సరైన స్థితియందున్నప్పుడే అధ్యాపకుడు అందించే విద్యను విద్యార్థి అందుకోగలడు. యీనాటి విద్యావిధానము ఈ స్థితిలో ఉండటానికి బాధ్యత యిరువురిపైననూ వుండటంచేతనే మనము ఈ విధమైన పరిస్థితిని అనుభవిస్తున్నాము. ఎవరిది దోషము, ఎవరిది దోషముకాదు అని చెప్పుటకు వీలుకాదు. రెండు చేతులు చేరినప్పుడే శబ్దము ఏర్పడుతున్నాది. విద్యార్థి, విద్యార్థి స్థితియందు వుండవలసిన స్థితిలో లేడు. అధ్యాపకుడుకూడను తాను వుండవలసిన స్థితిలో లేడు. ఈ ఇద్దరియందు పవిత్రమైన మార్పులు కలగాలి. మానవాభ్యుదయమే కాకుండా శ్రేయస్సు, ప్రేయస్సుయొక్క తత్త్వాన్ని మనము యిందులో గుర్తించాలి. విద్యార్థియొక్క హితము గోరి అధ్యాపకుడు బోధించాలి. గురుభక్తి తప్ప అన్య విషయములందు యేమాత్రము మనస్సును ప్రవేశపెట్టకుండా విద్యార్థి స్థిరముగా వుండాలి. అప్పుడే ఉత్తమ విద్యను తాను అందుకొని దేశమునకు ఆదర్శప్రాయుడైన విద్యార్థిగా రూపొంది వున్నత స్థాయిని దేశమునకు అందించగలడు.

sri sathyasai vachanamrutam

ముఖ్యముగా మనము యీనాడు గుర్తించవలసినది మానవతా గుణములు మానవునియందు లేకపోవుచున్నవి.

**మానవాకారముండిన మనుజుడగున**
**సద్బుద్ధులే మనుజుని సత్యరూపు**

ఈ సద్గుణములనేవి మానవుని విలువలుగా మనము విశ్వసించాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస లనే తత్త్వాన్ని మీరు యీనాడు మరచిపోతున్నారు. ఈ పవిత్రమైన మానవతా గుణములను యీనాడు విస్మరించారు. తాత్కాలిక సుఖమును, సంతోషమును, భోగభాగ్యములను అందించే లౌకిక విషయముల పైన విశ్వాసమును అభివృద్ధిపరచుకుంటున్నారు. నిత్య సత్యమైన తత్త్వమును విద్యార్థులు విశ్వసించినప్పుడే యీ మానవత్వమనేది వీరు ప్రకటించటానికిగానీ, వికసింప చేసుకోటానికిగానీ అర్హులౌతారు.

**ఎన్ని విద్యలు కల్గి యేమి ఫలము**
**నొసటి వ్రాత తప్పించ ఎవరి తరము**
**చెడ్డ బుద్ధులు తల చేరెనేని**
**ఎండబారును బుద్ధులు బెండుబారును**

దుర్బుద్ధులను ప్రవేశపెట్టుకోటంచేతనే ఈనాటి మానవుడు ఎన్నివిద్యలు అభ్యసించినప్పటికిని తాను అనుభవించతగిన ఆనందమును, సుఖమును అందుకోలేకపోతున్నాడు. గొప్ప విద్యావంతుడు కావచ్చును, సకలశాస్త్ర సారములుకూడను అధ్యయనము చేసి వుండవచ్చును. కాని, సంకుచిత భావములు వుండినప్పుడు యీ విద్యలయొక్క ప్రయోజనము జగత్తున కేమాత్రము అందించలేదు. విశాలమైన భావము, పవిత్రమైన హృదయాన్ని తాను అభివృద్ధిపరచుకోవాలి. విద్యకు, సంస్కారమునకు యెంతో తేడా వున్నది. విద్యతోపాటు సంస్కారముకూడను అవసరము.

**విద్యతోబాటు ఇంద్రియనిగ్రహము అనగా దమమును సాధించినవారే విద్యావంతులు**

srisathyasai vachanamrutam

ప్రాచీనకాలమందు సకలవిద్యలు అభ్యసించిన వ్యక్తులకు 'పండితుడు' అనే బిరుదునందించేవారు. విద్యయొక్క విశిష్టతను గుర్తించిన వ్యక్తులకు బిరుదులు అందించటము ఆ కాలములోని ఋషుల స్వభావము. సంస్కృతమునందు గొప్ప పండితునకు, సకలవిద్యా ప్రవీణునకు 'సాక్షర' అని పేరు. పాండిత్యముతో బాటు యింద్రియనిగ్రహముకూడా అవసరమని ఆనాడు ఒక పద్ధతి. పండితుడైన విద్యావంతునకు యింద్రియ నిగ్రహమే లేకుండిన పాండిత్యము యేమాత్రము ప్రకాశించదు, రాణించదు. ఈ యింద్రియ నిగ్రహమునే 'దమ' అని పిలిచేవారు. విద్యతోబాటు దమమునుకూడా సాధించినవారే 'విద్యావంతులు', అని, ఆనాటి నమ్మకము.

**విద్యాహీనులైన అజ్ఞానులకంటె విద్యావంతులైన మూర్ఖులవల్లనే ఈనాడు దేశమునకు ఎక్కువ అపకారము జరుగుతున్నది**

యీనాటి కాలప్రభావముచేతను, దేశకాలపరిస్థితుల ప్రభావముచేతను యీ విలువలన్నీ మారిపోతూ వస్తున్నాయి. ఏకొంత విద్యావంతుడైనప్పటికి అహంకారముచేతను, ఆడంబరములచేతను తాను విఱ్ఱవీగిపోతున్నాడు.

**విద్యయొసగు వినయము**
**వినయంబువలన కల్గు పాత్రత**
**పాత్రతవలన ధనము**
**ధనమువలన ధర్మంబు**
**ధర్మంబువలన ఐహికాముష్మికములనొందు నరుడు**

కనుక వినయ భయవిశ్వాసములే విద్యార్థులకు, విద్యావంతులకు సరైన శోభ. రెండక్షరములైన ఏ 'బి.ఎ.' నో, ఏ 'ఎం.ఎ.' నో, ఏ 'పి.హెచ్‌డి' నో తీసుకొనేటప్పటికి అతనికి పట్ట పగ్గాలు ఉండవు. ఏతావాతా దీనియొక్క భావము యేమనగా ఆ వ్యక్తికి యింద్రియ నిగ్రహము లేదనే దీని అర్థము. ఇంద్రియ నిగ్రహము కల్గినవానిని 'దమ' అని పిలుస్తూ వచ్చారు. కానీ, యీ అహంకార ఆడంబరములతోకూడినవారికి 'దమ' అనేది తిరగేసి 'మద' అనే రూపముగా తయారౌతున్నది. మదము ఎప్పుడు పెరిగిపోవునో యింక

sri sathyasai vachanamrutam

'సాక్షర' అనేది 'రాక్షసగా' మారిపోతుంది. ఆనాటి బిరుదులన్నీ యీనాడు విరుద్ధమైన మార్గములో వినియోగించుకుంటున్నారు. కనుక, యీనాటి విద్యావంతులందరూ కేవలము ఒక రాక్షసాకారమునే ధరించి జగత్తునకు అనేక విధములైన అపకారములు జరుపుతున్నారు. విద్యాహీనులైన అజ్ఞానులకంటే విద్యావంతులైన మూర్ఖులవల్లనే దేశమునకు యెక్కువగా అపకారము జరుగుచున్నది. కనుక యీనాటి విద్య యేమాత్రము విలువలేని పరిస్థితిలో దిగజారిపోవుచున్నది. యీనాడు ఉత్తమ విద్యార్థులు, ఉత్తమ అధ్యాపకులు అత్యవసరము. ఈనాడు అధ్యాపకులు వారి పవిత్రమైన భావములను సున్నితమైన, నిర్మలమైన బాలబాలికల హృదయమునందే యీ విద్యను ప్రవేశపెట్టటానికి కృషి సల్పాలి.

**దేశ క్షేమమును ఆశించిన ప్రతి వ్యక్తి తన పిల్లలను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టటానికి కృషి చెయ్యాలి**

ఈ బాలబాలికలయొక్క హృదయ క్షేత్రములు పవిత్రమైనవి, సారభూతమైనవి. కనుకనే గుణశీలములనే బీజములు యీ క్షేత్రమునందు నాటినప్పుడు యెంతైనా అభివృద్ధి గాంచి తగిన ఫలమును అందివ్వటానికి వీలవుతుంది. పెరిగిన పిల్లల హృదయములు సారహీనమైన క్షేత్రములు. అట్టి సారరహితమైన క్షేత్రములలో ఎంత పవిత్రమైన, వుత్తమమైన విత్తనములు నాటినప్పటికి మనము ఆశించిన ఫలితములు అందుకోలేము. ముదిరిపోయిన పొట్లకాయలవంటివారు, పెరిగిన పిల్లలు. ముదిరిన పొట్లకాయను చక్కచేయటం ఎవరితరముకాదు. లేతపొట్లకాయగా వుండినప్పుడే దానికి తగిన భారమైన రాయి కట్టినప్పుడు అది చక్కగా పెరిగి అభివృద్ధిని పొందుతుంది. కనుక, యీనాటి బాలవికాస్ విద్యార్థినీ విద్యార్థుల హృదయములలో మనము పవిత్రమైన భావములు ప్రవేశపెట్టటానికి కృషిచెయ్యాలి. మనము యీ కళాశాలలలో యెన్ని విధములైన శ్రమలు చేసినప్పటికి యిది అంతఫలితమును ఇవ్వలేదు. Higher Secondary School వరకుకూడను కొంతవరకు మనము అభివృద్ధి గావించుకోవచ్చు. భవిష్యత్‌లో దేశోద్ధారకులు, నేటి విద్యారినీ విద్యార్థులే! ఈనాటి బాలబాలికలే భవిష్యత్తులో నాయకులు.

sri sathyasai vahini amrutam

దేశముయొక్క మంచి, చెడ్డలన్నీ యీనాటి పిల్లలపైననే ఆధారపడివుంటున్నాయి. కనుక, దేశక్షేమము ఆశించే ప్రతివ్యక్తికూడను తన పిల్లలను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి.

**'అమ్మ మాటలో వున్న మాధుర్యము అయ్య మాటలో ఉండదు'**

ముఖ్యముగా అధ్యాపకులలో స్త్రీలు చాలా ప్రధానమైన స్థానములో వున్నారు. విద్యార్థుల హృదయాలతో సంభాషణ సలిపే శక్తి సామర్థ్యములు ఒక్క స్త్రీలకు మాత్రమే వున్నవి. అమ్మ మాటలలో వున్న మాధుర్యము అయ్య మాటలలో వుండదు. కనుక, పాఠశాల స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులకు చక్కగా బోధించాలంటే స్త్రీలు అధికముగా వుండాలి. వీరివలన దేశమునకు ఎంతైనా వుపకారము జరుగుటకు అవకాశము వున్నది. స్త్రీలయొక్క బోధనా విధానమునందు చాలా సున్నితమైన, మధురమైన భావములు వుంటాయి. స్త్రీల బోధలకు స్పందించే రీతిగా యీ పిల్లలు పురుషులయొక్క బోధలకు యేమాత్రముకూడను స్పందించరు. కనుక, విద్యార్థులకు బోధ చెయ్యాలనుకున్నప్పుడు స్త్రీ అధ్యాపకులు అత్యవసరము. ఈ బోధనలయందు మతసంబంధమైన విషయములు యేమాత్రము ప్రవేశపెట్టకూడదు, ఈ లేత వయస్సునందు ఇటువంటి వివాదాస్పదమైన విషయాలు పిల్లల హృదయాల్లో ప్రవేశపెట్టినప్పుడు వారి భవిష్యత్తు యే మాత్రము అభివృద్ధికి రాదు. సమాజముయొక్క శక్తి సామర్థ్యములు, దేశముయొక్క విశిష్టతను గుర్తించలేని లేత హృదయములలో యీ భావాలు యేమాత్రము ప్రవేశపెట్టకూడదు. వారు పెరుగుతూ దేశముయొక్క పరిస్థితిని, సమాజముయొక్క స్థితిని క్రమేణా అర్థము చేసుకునే సమయమునందు వారికి యీ రాజకీయములుగాని, మతతత్త్వముగాని క్రమక్రమేణా బోధించవచ్చు. విద్యార్థులకు బోధించే అధ్యాపకులు మొట్టమొదట ఆ బోధనాంశములను తాము అర్థము చేసుకొని, ఆచరణలో పెట్టి, అప్పుడు విద్యార్థులకు అందించటానికి ప్రయత్నించాలి.

**అధ్యాపకులు తాము బోధించే విలువలను ముందుగా తాము ఆచరిస్తూ విద్యార్థులకు బోధించాలి**

sri sathyasai vachanamrutam

యీనాటి విద్యార్థులకు తెలివితేటలు మితిమీరిపోతున్నవి. కానీ, గుణము క్షీణించిపోవుచున్నది. మనము ఏవైనా ఉత్తమ భావములు, ఉత్తమ విషయములు పిల్లలకు అందించే సమయములో పిల్లలు తమ తెలివితేటలతో

చెప్పేవారియొక్క పరిస్థితి గుర్తించటానికి ప్రయత్నిస్తూ వుంటారు. సత్యము, ధర్మము, శాంతి, అహింసలను గురించి ఒక విద్యార్థికి మనము బోధిస్తూ వున్నామంటే ఆ విద్యార్థి యీ బోధించే అధ్యాపకునియందు పంచప్రాణస్వరూపమైన ఈ మానవతా విలువలు వున్నవా అని విచారించటానికి ప్రయత్నించవచ్చు. అందులో సత్యసాయి సంస్థలు యీనాడు అనేక విధములుగా దేశవ్యాప్తముగావటంచేత, సహస్ర నేత్రములతో మనలను గమనిస్తూ వుంటున్నారు. ఏకించిత్ దోషము కనపడినా వారు సహస్ర నేత్రములతో పరిశీలిస్తూ వుంటారు. కనుక మనము ఆచరించక విద్యార్థులకు చెప్పటానికి పూనుకుంటే యెంత శ్రమపడినప్పటికి యిది ప్రయోజనము వుండదు. ఇది కాలము వ్యర్థము. ధనము వ్యర్థము. మనయొక్క శక్తి సామర్థ్యములు వ్యర్థమై పోతాయి. కనుక చెప్పే విషయాలలో ఏ ఒక్కటైనా మనము ఆచరణలో పెట్టి ఆ తరువాత పిల్లలకు బోధించటానికి ప్రయత్నించాలి. అధ్యాపకుడు సిగరెట్టు తాగుతూ విద్యార్థికి 'ఏయ్ సిగరెట్టు తాగటం తప్పు'ని చెబితే ఆ విద్యార్థి వింటాడా? ఈనాడు వినే పరిస్థితియా? వినడు. 'సిగరెట్టు తాగటం తప్పైతే మీరెందుకు తాగుతున్నార'ని ప్రశ్నించే కాలము. కనుక యీనాడు విద్యార్థులకు సత్యము చెప్పాలి అని బోధించే సమయములో మనముకూడను సత్యమును అనుసరించాలి.

ఒక చిన్న ఉదాహరణ. ఇంటిలో తల్లి తండ్రులుంటారు. డ్రాయింగురూములో కూర్చొని టి.వి. చూస్తుంటారు. రేడియో వింటుంటారు. అదే సమయంలో ఏదో ఒక ఫోను వచ్చిందనుకోండి. వీళ్ల ఆనందమునకు భంగము కలుగుతుందనుకొని దానిని క్రిందపెట్టేస్తారు. లేక పిల్లవాడు వెళ్లి ఆ ఫోను యెత్తుకొని హలో అని మాట్లాడినప్పుడు ఎవరో అక్కడనుంచి మాట్లాడుతారు. వీరి ఆనందమునకు భంగము కలుగుతుందో యేమోనని ఆ పిల్లవానికి చెప్తారు, తల్లి తండ్రులు 'not available అని చెప్పరా', అంటారు. దీనితో పిల్లవాడు చాలా యోచిస్తాడు. 'తండ్రి యిక్కడ కూర్చునికూడను లేడు అని

sri sathyasaivachanamrutam

చెప్పమంటున్నాడే, యిది అబద్ధమే కదా!' అని భావించుకుంటాడు. ఈ విధంగా ఒక చిన్న అల్పమైన విషయములోపల మన పిల్లలను యీ విధమైన అసత్యములో ప్రవేశపెట్టి వారి భవిష్యత్తునంతా చెడగొడుతున్నాము, మనము. అదే విధముగ అధ్యాపకులుకూడను తాము బోధించే బోధనలకు విరుద్ధమైన మార్గములో నడచుకోటంచేత విద్యార్థులు దానిని వినికూడను ఆచరణలో పెట్టటానికి యేమాత్రము అభిలషించరు.

**మనము మన ఆత్మసాక్షిగా నడచుకోవాలి**

కనుక తల్లితండ్రులుకూడా మొట్టమొదట విద్యార్థులుగా మారాలి. ఈ మానవతా విలువలన్నీ మొట్టమొదట ఆచరణలో పెట్టాలి. ప్రాకృతమైన విషయములందుకూడా అసత్యమాడకుండా చూచుకోవాలి. సహనాన్ని సంపాదించుకోటానికి ప్రయత్నించాలి. ధర్మము. ఏమిటి ధర్మము మనకు? శారీరకమైన ధర్మము, ఆత్మకు సంబంధించిన ధర్మము రెండు వున్నాయి. శారీరక ధర్మములు సహజమైన ప్రాకృత ధర్మములు. అనగా గుణ సంబంధమైన ధర్మములు. గుణాతీతమైన తత్త్వమే స్వధర్మము. అనగా మన ఆత్మానుసారము అనుసరించటము. దీనినే పిల్లలకు నేను అప్పుడప్పుడు చెబుతూ వుంటాను, నాలుగు F లు అని. Follow the Master, Face the devil, Fight to the end, Finish the game. Follow the Master అంటే ఎవరు నీ Master? నీవిద్య నేర్పించే మాష్టరా లేక యింకే విధమైన సాధనలు అభివృద్ధి పరచే మాష్టరా? కాదు, కాదు, నీ హృదయమే నీ Master. నీ conscience యే నీ Master. నీ conscience ను నీవు అనుసరించు, నీ conscience నిన్ను తప్పు మార్గము పట్టించదు.

ఒక చిన్న ఉదాహరణము. ఒక రాత్రి ఒక దొంగ ఒక యింటిలో దొంగతనము చేసి సామాగ్రినంతా తీసుకొని వచ్చాడు. తెల్లవారేటప్పటికి వీరు police complaint యిచ్చారు. పోలీసులు యితనిపైన అనుమానముచేత యితనిని పట్టుకున్నారు. కానీ దొంగయైన యీ వ్యక్తి తప్పించుకునే నిమిత్తమై తాను దొంగతనము చేయలేదని అబద్ధము చెబుతున్నాడే గానీ తన ఆత్మసాక్షిగా 'రాత్రి నేను వెళ్లాను. దొంగతనము చేశాను. సామాగ్రినంతా ఫలానా దగ్గర పెట్టాను' అని యేమాత్రము సత్యము చెప్పటంలేదు. ఎప్పుడు తన (మాష్టరును)

srisathyasai vahinamrutam

conscience ను తాను వంచించికుంటాడో వాడింక యేమాత్రము మంచి మార్గములో ప్రవేశించలేడు. తన మాష్టరైన తన ఆత్మను ఎవరు వంచించుకుంటాడో వాడు మంచి కార్యములు చేయలేడు. కనుక ఆత్మసాక్షిగా నీవు ప్రవర్తించాలి. 'నేను చేసేది మంచిది, నేను చేప్పేది సత్యము', అనే విశ్వాసము తనకే అభివృద్ధి కావాలి. అప్పుడే self satisfaction కలుగుతుంది. అదే 'ఆత్మ తృప్తి' అన్నారు. ఈ ఆత్మతృప్తి కల్గినప్పుడు అంతనూ త్యాగము చేస్తాడు. అదే self sacrifice అన్నారు. ఎప్పుడూ యీ త్యాగము చేసినాడో అప్పుడే self realisation ఆత్మసాక్షాత్కారము ప్రాప్తిస్తుంది. కనుక, అధ్యాపకులకు మొట్టమొదట self confidence అత్యవసరము. ఈ self confidence వుండిన వ్యక్తికి తప్పక self satisfaction లభిస్తుంది. ఎప్పుడు self satisfaction అయిందో self sacrifice చేస్తాడు. self satisfaction లేని వ్యక్తే sacrifice చేయలేడు. self satisfaction లేనివాడు యే చిన్న కార్యమును సక్రమముగా నిర్వర్తించలేడు. యీ self sacrifice చేసినవానికే self realisation. తన తత్త్వము తాను గుర్తించుకోగలడు. కనుక మొట్టమొదట ఆత్మవిశ్వాసముతో మనము యీ రంగములో ప్రవేశించాలి.

**అధ్యాపకులు ప్రకాశవంతమైన జ్యోతివలె ఉండాలి**

అధ్యాపకులారా! యీ జగత్తులో వుండిన సమస్త సేవలయందుకూడను యీ అధ్యాపక సేవ అనేది చాలా వుత్తమమైన సేవ. పవిత్రమైన సేవ. ఎన్ని వందలమంది విద్యార్థులనో బాగు చేయటానికి ప్రాప్తించినది. కనుక యిలాంటి పవిత్రమైన మార్గములో ప్రవేశించిన మీరు సాధ్యమైనంతవరకు శక్తి వంచన లేకుండా కృషి చెయ్యాలి. ఈ Education in Human Values అనేది పవిత్రమైన రంగము. ఈ చైతన్యమును జగత్తంతయు వ్యాపింపచేయటానికి తగిన ప్రయత్నము చేయాలి. ఈనాడు 42 దేశములవారంతా అధ్యాపకులు వచ్చి చేరారు. ఈ అధ్యాపకులందరుకూడను యీ యొక్క విషయములను తమ చిత్తములందు హత్తుకునేటట్టుగా చేసుకొని తిరిగి తమ దేశములకు వెళ్లి ఆ దేశములలోకూడను కొన్ని సంస్థలయందున్న అధ్యాపకులను చేర్చి వారికికూడను యీ బోధలు చేసి తగిన ట్రైనింగు అందించాలి. ఇందులో అధ్యాపకులు యేరీతిగా వుండాలంటే

srisathyasaivahini.org

వెలుగుతున్న జ్యోతివలె వుండాలి. ఈ వెలుగుచున్న జ్యోతియే మిగిలిన జ్యోతులను వెలిగించటానికి తగిన అర్హతగలిగి వుంటాది. కనుకనే యీనాటి అధ్యాపకులు మీరందరు వెలుగుతున్న జ్యోతులవలె వుండినప్పుడే మిగిలిన అధ్యాపకులందరికికూడను యీ విధమైన వెలుగును అభివృద్ధి పరచటానికి తగిన ప్రోత్సాహములను అందించవచ్చు. మీయందు నిరంతరము యీ విద్యా జ్యోతిని యెప్పుడూ కాపాడుకుంటూరావాలి. అప్పుడే మన ఆశయాన్ని పూర్తిగా, ఆనందముగా సాధించిన వారమవుతాము.

**మానవతా విలువలు పంచకోశముల రూపములో మన దేహములోనే ఉన్నవి**

ఈ Human value అనేది కొత్తగా మనము సంపాదించేది కాదు, మన సహజ జీవితములో వుండినదే! ఇది జీవితమునకు ప్రధానమైనది. ఇదే మన జీవితము. దీనినే The proper study of mankind is man అన్నారు. అనగా మన thoughts, మన words, మన action యీ మూడింటియొక్క యేకత్వమే మన స్వరూపము. దీనినే ఉదయము గోకాక్‌కూడను చెప్పాడు. అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశములనే పంచ కోశములను సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలయొక్క ప్రతిబింబములుగా మనము విశ్వసించాలి. అన్నమయకోశము యీ దేహము. ఇందులో అతిసూక్ష్మమైన ప్రాణమయము, యిందులోనే మరింత సూక్ష్మమైన మనోమయము వుంటున్నాది. కానీ యీనాడు మనయొక్క ప్రయాణము అన్నమయకోశమునుండి మనోమయకోశమువరకే చేరి అక్కడ నిల్చిపోతున్నాము. మనము చేరవలసిన గమ్యమును చేరలేకపోతున్నాము. ఏది మన గమ్యము? అన్నముతో ప్రారంభమైన మన ప్రయాణమును ఆనందమే గమ్యముగా అదే మనకు అంత్యముగా తీసుకోవాలి. శరీరము అన్నమయమైనప్పటికి, యీ శరీరముద్వారా మనము మనోమయమును సాధించి విజ్ఞానమయములో ప్రవేశించి యీ విజ్ఞానముచేత ఆనందమయములో చేరిపోవాలి. ఎంతకాలమైనా మనము యీ అన్నమయ దేహముతోనే జీవిస్తూ వుంటుంటే యింక ఆనందమయమును యేనాడు మనము అనుభవించేది? పశుపక్షి మృగాదులుకూడను యీ విధమైన జీవితాన్ని గడపుతూనే వుంటున్నాయి. ఇంక

srisathyasaivachanamrutam

మానవత్వమునకు విశిష్టత యెక్కడ? ఇన్ని చదువులు చదివి, యింత విజ్ఞానము ఆర్జించి, యిన్ని డిగ్రీలు తీసుకొని, పశువులకంటె హీనమైన పరిస్థితిలో మనము ప్రవర్తిస్తుంటే యింక మానవత్వముయొక్క విశిష్టతను మనము యేరీతిగా చెప్పుకోగలము? ఈ పశుపక్షిమృగాదులకు విజ్ఞానమయములేదు. ఏదో కొంతవరకు వుండవచ్చుగానీ నిత్యానిత్య విషయ పరిశీలనాశక్తిగాని, ఆత్మానాత్మ విచారణశక్తిగాని యీ పశుపక్షి మృగాదులకు లేదు. ఇది ఒక్క మానవునకు మాత్రమే వున్నది. కనుకనే 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. అన్నమయమైన యీ దేహముతో ప్రారంభమైన మన జీవితమును ఆనందమయమువరకు ప్రయాణము చెయ్యాలి. దానికి విజ్ఞానమయము చాలా అవసరము. అందుకు ఆచరణపూర్వకమైన ప్రచార, ప్రబోధలు సల్పాలి.

**విద్యార్థులకు బోధించేటప్పుడు ఉపాధ్యాయులు చిన్న చిన్న విషయాలనుకూడా జాగ్రత్తగా గమనించాలి**

పిల్లలకు మనము బోధించే సమయములోపల చిన్నచిన్న విషయాలను సైతం సూక్ష్మ రీతిలో గమనించాలి. కాలమును అధికముగా దుర్వినియోగము చేయటానికి వాళ్లకు అవకాశము యివ్వకూడదు. అలా యిచ్చినప్పుడు వారు ఎన్ని విధములైన మార్గములనో అవలంబిస్తారు. అప్పుడప్పుడు క్లాసులో మనము చెప్పినవి పిల్లలు అర్థము చేసుకున్నారా లేదా అని చిన్నచిన్న ప్రశ్నలువేసి జవాబులు తీసుకోవాలి. అప్పుడప్పుడు మనము చదివించి చెప్పించిన విషయములు quiz అనే దానిలో కొన్ని questions వేసి యెవరు బాగా చెబుతారో వారికి వుత్సాహప్రోత్సాహము లందించాలి. ఇంతేకాదు, వాళ్లు యింటికి వెళ్లే సమయములో ఆటలు పాటలు అయిన తరువాత Home work కూడా వాళ్లకు ఇవ్వాలి. ఈ Home work తానే చేశాడా లేదా ఎవరితోనైనా చేయించుకొని వచ్చాడా అని తిరిగి అతనిని క్లాసులో ప్రశ్నించి దానికి సరైన జవాబు చెబుతాడా లేదా అని గుర్తించాలి. ఈ విధముగా పిల్లలందు ఉత్సాహప్రోత్సాహములను అందించి వారిని అభివృద్ధి గావించటానికి అధ్యాపకులు ఎంతైనా శ్రమ పడాలి. నిజముగా యిది మీరు ఒక సాధనగా భావించాలి. ఈ ఒక్క మార్గమును మీరు చక్కగా అనుసరిస్తే తప్పక మీకు భగవదనుగ్రహము ప్రాప్తిస్తుంది.

sri sathyasai vahinamrutam

మీరు వేరే జపములు, ధ్యానములు, యోగములు యేమాత్రము చేయనక్కరలేదు. పిల్లలను అభివృద్ధిపరచే మార్గములో మీ కర్తవ్యమును నిర్వర్తించుకుంటే యిదే గొప్ప సేవ.

## సాయి సంస్థలందు అందరూ ఐకమత్యముగా ఉండాలి

యెన్నో జన్మలప్రాప్తివల్లనే మీకు యీ పవిత్రమైన అవకాశము లభించింది. ఈ చిక్కిన అదృష్టమును దక్కించుకొని పోషించుకోటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. అప్పుడే అధ్యాపకులుగా ఉన్నందుకు మీ జన్మ సార్థకమవుతుంది. పిల్లలకు మధ్యమధ్య కొన్ని భజనలు, కొన్నికొన్ని పవిత్రమైన కథలు తెలపాలి. ఒక మతమునకు, మరొక మతమునకు భిన్న భావములను వారికి బోధించరాదు. అందరు భగవంతుని బిడ్డలుగా వారికి సమిష్టిని బోధించాలి. ముఖ్యముగా మన అధ్యాపకులందుగాని, సాయిసంస్థలందువుండిన వ్యక్తులుగాని నేర్చుకోవలసినది ఒకటి వుంది. ఐకమత్యమును పెంచుకోవాలి. అందరు ఐకమత్యముగా చేరి అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములవలె యీ కార్యములో ప్రవేశించాలి. ఏదో చిన్న చిన్న భేదములు వచ్చినప్పటికి, వాటిని యేమాత్రము హృదయానికి తీసుకోరాదు. అప్పటికప్పుడే మరచిపోయి అన్ని విధములా అందరితో కలసిమెలసి మాట్లాడుతూరావాలి. చిన్న చిన్న విషయాలలో ఒకరితో ఒకరు పోట్లాడుతూ అశాంతికి గురిచేసే వాతావరణమును కల్పించరాదు. మూర్ఖత్వమును పెంచుకోరాదు. ఇది నాకు తగదు, అని తనకు తననే దండించుకోవాలి. Teachers యందుగాని, విద్యార్థులయందుగానీ గ్రూపులు తయారుకారాదు. అందరు ఒక్కటే! ఐదు వేళ్లు వేరు వేరుగా కనిపిస్తున్నాయి మనకు. కానీ ఏదైనా ఒక పనిలో ప్రవేశించేటప్పటికి ఐదుచేరి పనిచేస్తాయి, యేకంగా! అదే విధముగనే అందరు ఒకే భగవంతుని బిడ్డలవలె ఐకమత్యముగా ఎవరికి తగిన కర్తవ్యమును వారు నిర్వర్తిస్తూ రావాలి. వ్యక్తిగతమైన ద్వేషములుగానీ, సామాజిక సంబంధమైన ద్వేషములుగానీ, భాషా, వేషములయొక్క ద్వేషములుగానీ యేమాత్రము మనలో ప్రవేశించరాదు. ఎప్పుడు ద్వేషము మనలో ప్రవేశిస్తుందో అప్పుడే మాలిన్యము చేరిపోతుంది.

sri sathyasai vahini vachanamrutam

## యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ

ఈ మాలిన్యమును మనము దూరము చేసుకోవాలంటే unity అత్యవసరము. Unity కలిగినప్పుడే మనలో purity అభివృద్ధి అవుతుంది. ఈ unity లేకపోతే enmity వచ్చి ప్రవేశిస్తుంది. ఎప్పుడు యీ purity కలుగునో అప్పుడు మనకు divinity ప్రాప్తిస్తుంది. కనుక అందరూ ఐకమత్యముగా పనిచేస్తూ రావాలి. ఈ ఐకమత్యమును పెంచుకోటమే చాలా అవసరము. యీనాడు ఐకమత్యమనేది క్షీణించిపోవటంచేతనే యిన్ని విధములైన అల్లకల్లోలములకు గురౌతున్నాము. ఇంటిలో ఐదుమంది వ్యక్తులుంటే ఐదుమందిలోను ఐదు భావాలు. బయట బోధించేదానికంటే మనము మొట్టమొదట యింటిలో unity ని develop చెయ్యాలి. అప్పుడే మనము బయట చెప్పటానికి తగిన అర్హత సాధించుకుంటాము. కనుక యీ unity తో పాటు మీయొక్క ప్రవర్తన సక్రమమైన మార్గమునందు అలవరచుకొని తద్వారా విద్యార్థులకు బోధించటానికి తగిన కృషి చెయ్యాలి అని నేను ఆశిస్తున్నాను.

సాయిసంస్థలలోపల యేవిధమైన భేదభావములు లేకుండా వుండాలి. దేశమునకు సుక్షేమము సంపాదించాలి. ఈనాడు యెక్కడ చూచినా అశాంతి, ఎక్కడ చూచినా భయము, ఎక్కడ చూచినా దుర్మార్గము చాలా చెలరేగిపోయింది. దీనిని చల్లార్చాలంటే ప్రేమతత్త్వముద్వారా దేశములో శాంతి నెలకొనెటట్లు ప్రచార, ప్రబోధలు సలపాలి. ముఖ్యముగా విదేశములనుండి వచ్చిన భక్తులు చాలా ప్రధానమైన ఒక విషయమును మీరు గుర్తించుకోవాలి. విదేశములలోనే కాకుండా, ఈనాడు భారతదేశమునందుకూడా ఒక వ్యసనము అభివృద్ధి గాంచుతూ వస్తుండాది. చిన్న చిన్న పిల్లలుకూడా drugs కు బానిసలైపోతున్నారు. ఈ విధంగా వీరు drugs వుపయోగించకుండా వుండే మార్గాన్ని మొట్టమొదట మీరు అవలంబించాలి. దీనివల్ల సహజమైన మతులుకూడను చెడిపోతున్నాయి. మానవత్వాన్నే కోల్పోతున్నారు. అలాంటివారికి బోధలెన్ని చేసినా ప్రయోజనములేదు. కనుక యీ drugs వల్ల కలిగే అపకారము యేమిటి, నష్టము ఏమిటి, అని పిల్లలకు మీరు చక్కగా బోధించాలి. దీనిని మానివేయటానికి యెంతైనా కృషి చెయ్యాలి.

sri sathyasai vachanamrutam

పిల్లలకు బోధచేయటానికి ముందు మీరు ఆ drugs వాడకం పూర్తిగా మానాలి. అప్పుడే మీరు పిల్లలకు చెప్పే అధికారము కలిగివున్నవారౌతారు. యీ విషయములోపల జాగ్రత్తను వహించినప్పుడు దేశము యెంతగానో బాగుపడుతుంది.

**సంశయ నివృత్తి, శ్రద్ధను పెంచుకోవడము, ఈ రెండు జీవిత ప్రవాహమునకు ఇరువైపులా ఉండే రెండుగట్లు**

ఇంకా మూడు దినములు మనము యీ Human Values ను గురించి యెంతగానో సంప్రదించవలసివున్నది. కొంతమంది teachers కు కొన్ని సందేహాలు వుంటుంటాయి. ఈ సందేహములు మీరు ఒక కాగితముపై వ్రాసుకొని దగ్గరపెట్టుకుని అవకాశము వచ్చినప్పుడు ఆ సందేహములను వెల్లడిస్తే వాటిని పూర్తిగా పరిహారము చేస్తాను. మీలో ఎట్టి సమస్యలు వుండినప్పటికి నేను సులభముగా పరిహారము చేస్తాను. కానీ, మీరు సందేహములను మనసులో పెట్టుకొని వాటిని పెంచుకోటానికి ప్రయత్నం చేయకండి. సందేహము పరిహారమైనప్పుడే మీకు ప్రశాంతత చేకూరుతుంది. 'సంశయాత్మా వినశ్యతి'. సంశయములు వుండినవారు ఏమాత్రము ముందుకు పోలేరు. దీన్ని పరిహారము చేసుకోటంకూడను ఒక మంత్రయోగము. భారతదేశములో 'ఓం నమోనారాయణాయ' అనే అష్టాక్షర నామమును కొందరు జపించటం మనం చూస్తాము. ఈ నామము జపించినందువల్ల నారాయణ అనుగ్రహము లభిస్తుందని వారి విశ్వాసము. జీవితమనేది పెద్ద ప్రవాహము వంటిది. ఈ ప్రవాహానికి ఒక హద్దుఅంటూ లేకపోతే అన్ని విధములకూడను ముంచి వేస్తుంది, దేశాన్ని. ఈ ప్రవాహమును కొంతవరకు మళ్ళించి భగవదనుగ్రహమనే సాగరములో చేర్చాలి. ఈ ప్రవాహము సాగరములో ప్రవేశించాలంటే దానికి అటువైపున యిటువైపున హద్దులుండాలి. ఆ హద్దులే ఒక వైపున 'సంశయాత్మా వినశ్యతి'. యిది అష్టాక్షరనామము. రెండవవైపున 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' యిదికూడా అష్టాక్షర నామము, మరొకవైపున. అనగా సంశయనిర్మూలనము చేసుకోటము, శ్రద్ధను పెంచుకోటము, ఈ రెండింటియందును మనము అభివృద్ధి గాంచినప్పుడు ఒడిదుడుకులకు మనము భయపడనక్కరలేదు. మన జీవితము direct గా పోయి

sri sathyasai vachanamrutam

దైవముతో చేరిపోతుంది. ఈ శ్రద్ధను యే విధముగా అభివృద్ధి పరచుకోవాలి? ఈ సంశయమును యే రీతిగా నిర్మూలము గావించుకోవాలి? దాని విషయమును మనము గుర్తించుకోవాలి. తగిన అవసరము వచ్చినప్పుడు, సమయము చిక్కినప్పుడు, మీరు యీ సందేహ నివారణ చేసుకొని ఆనందమును అనుభవించి మున్ముందు జరుగవలసిన కార్యక్రమములో వుత్సాహప్రోత్సాహాలను పెంచుకోవాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 28-12-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam